క్లుప్తంగా

నేడు పోటుమెరకలో గడప గడపకు మన ప్రభుత్వం

రేపల్లె రూరల్: మండలంలోని పోటుమెరక గ్రామంలో ఈ నెల 20వ తేదీ గురువారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గాదె వెంకయ్యబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, నియోజకవర్గ నాయకుడు మోపిదేవి రాజీవ్‌లు పాల్గొనే కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

మసీదులకు స్వీట్లు అందజేత



రేపల్లె: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అన్ని మసీదులకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లింల అభివృద్ధికి చేయూతనందిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకట రమణారావుకు మైనార్టీలు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

'చిన్న చిన్న నిర్లక్ష్యాలతోనే అగ్నిప్రమాదాలు'

రేపల్లె రూరల్: చిన్న చిన్న నిర్లక్ష్యాలతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకునేందుకు అవకాశం ఉందని ఫైర్ ఆఫీసర్ సాంబశివరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా పట్టణంలోని పల్స్ హాస్పటల్‌లో వైద్యశాల సిబ్బంది, రోగులు, ప్రజలకు బుధవారం అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇంటిలో వంట పూర్తవగానే గ్యాస్ రెగ్యులేటర్‌ను ఆపివేయాలన్నారు. విద్యుత్ వైర్ల కనెక్షన్‌లను జాగ్రత్తగా పరిశీలించి సరి చేసుకోవాలన్నారు. పెట్రోలు బంకుల వద్ద ధూమపానం, సెల్‌ఫోన్‌లో మాట్లాడటం వంటి చర్యలకు పాల్పడరాదన్నారు. గడ్డివాములు, పూరిళ్లు ఉన్న ప్రదేశాలలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యశాల వైద్యులు తన్నీరు రంగనాథ్, సింహాద్రి సహజ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నరసింహస్వామిని దర్శించుకున్న తహసీల్దార్ కవిత



పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మీసమేత లక్ష్మీ నరసింహస్వామి వారి దేవాలయానికి మండల తహసీల్దార్ కవిత విచ్చేసి స్వామివారిని దర్శించుకుని అర్చనలు, అభిషేకాలు చేయించారు. దేవాలయానికి సంబంధించిన విశేషాలను అడిగి తెలుసుకున్నారు. స్వామివారిని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

భట్టిప్రోలు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ సామాన్య ప్రజానీకంపై పెను భారాలు మోపుతూ కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతుందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు అన్నారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి జరుగుతున్న ప్రచారభేరి యాత్రలలో భాగంగా భట్టిప్రోలులో బుధవారం పర్యటించారు. నాగాంజనేయులు మాట్లాడుతూ మోదీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నమైందన్నారు. పార్టీ బాపట్ల జిల్లా కమిటీ అధ్యక్షుడు జి. బాలాజి, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక పరీక్షలు

భట్టిప్రోలు: మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్, ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం నుంచి 29వ తేదీ వరకు వార్షిక పరీక్షలు జరుగుతాయని భట్టిప్రోలు మండల విద్యా శాఖాధికారి పులి లాజర్ బుధవారం తెలిపారు. ఒకటి నుంచి 9వ తరగతి చదువుచున్న విద్యార్థులకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

రేపల్లె రూరల్: రహదారి ప్రమాదంలో గాయపడి చికిత్సపొందుతున్న వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ ఎస్‌ఐ సురేష్ తెలిపారు. రేపల్లె నుంచి అవనిగడ్డకు వెళ్తున్న ఆటోను పెనుమూడి – పులిగడ్డ వారధిపై మంగళవారం రాత్రి కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న అవనిగడ్డకు చెందిన పడమటి లక్ష్మణరావు(40), రాజేశ్వరిలకు తీవ్రగాయాలు కాగా, మరో ఏడుగురికి స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులకు రేపల్లె ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విజయవాడ తరలించగా చికిత్సపొందుతూ లక్ష్మణరావు మృతి చెందాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అందరి నినాదం 'మా నమ్మకం నువ్వే జగన్'

కొనసాగుతున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం



భట్టిప్రోలులో ఇంటింటికి వెళ్లి ప్రజలకు పథకాలు వివరిస్తున్న నేతలు



అలకాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ విజయ్‌కుమార్, నాయకులు



చావలిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాశ్

భట్టిప్రోలు: మండలంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తుంది. సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి గత నాలుగేళ్లల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిని గూర్చి వివరిస్తున్నారు. జేసీఎస్ మండల ఇన్‌చార్జి గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి. బుధవారం భట్టిప్రోలు సచివాలయా పరిధిలో జరిగిన కార్యక్రమాలలో కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, పీజీ అరుణ్ శాస్త్రి, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, తలకోల యలమంద, షేక్ అబ్దుల్ కరీమ్, పెరికల శ్యామ్, వలంటీర్లు పాల్గొన్నారు. మండలంలోని ఐలవరం సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మురుగుడు శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాచర్ల హేమసుందరరావు, గ్రామ కన్వీనర్ మాచర్ల తులసి రంగయ్య, నాయకులు పాల్గొన్నారు. చుండూరులో జేసీఎస్ మండల ఇన్‌ఛార్జ్ అన్నపరెడ్డి వీరారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

అలకాపురంలో...

పిట్టలవానిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి సూచనలతో పిట్టలవానిపాలెం గ్రామంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కన్వీనర్ మండే విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ మంతెన గంగరాజుతో కలిసి జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండే విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని కొనియాడారు. ప్రతి ఇంట సంక్షేమ పథకాల లబ్ధి పొందిన వారు తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రతి ఇంటి నుంచి విశేష స్పందన లభిస్తుందని తెలిపారు. వలంటీర్‌లు, గృహ సారథులు, వార్డు, సచివాలయ కన్వీనర్‌లు ఉన్నారు.

చావలి(వేమూరు): మండలంలోని చావలి గ్రామంలో బుధవారం జరిగిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గాజుల భాను ప్రకాశ్ పాల్గొని, ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కూచిపూడిలో...

కూచిపూడి(వేమూరు): అమర్తలూరు మండలంలోని కూచిపూడి గ్రామంలో బుధవారం జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ కొండ మూది శ్యాముల దేవి కార్యక్రమంలో పాల్గొని ఇంటింటి వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకుని, వారి అనుమతితో స్టిక్కర్లు అంటించారు. సొసైటీ అధ్యక్షుడు సురేష్, గ్రామ సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ అన్నెకు ఎంపీ మోపిదేవి నివాళి



అన్నె రామకృష్ణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

రేపల్లె: ఆగంతకుల దాడిలో మృతి చెందిన పట్టణంలోని 14వ వార్డు కౌన్సిలర్ అన్నె రామకృష్ణ మృతదేహాన్ని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు బుధవారం సందర్శించారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్నె కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. ఇంకా ఆయనతో పాటు నివాళులర్పించినవారిలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథ గుప్త, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ కొమ్మూరి వీరబ్రహ్మేంద్రస్వామి, వివిధ వార్డుల కౌన్సిలర్‌లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కౌన్సిలర్‌లు ఉన్నారు. అదేవిధంగా అన్నె రామకృష్ణ మృతదేహాన్ని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మృతదేహానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు



చినమట్లపూడిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎంపీ మోపిదేవి




ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ఎంపీ మోపిదేవి, దేవినేని

నగరం: మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పర్వదినమని బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు చెప్పారు. మండలంలోని చినమట్లపూడి గ్రామంలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎంపీ మోపిదేవి పాల్గొని మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసంలో మత పెద్దలు ఇఫ్తార్ విందులు ఏర్పాటుచేయడం హర్షణీయమన్నారు. తొలుత ఎంపీ మోపిదేవికి ముస్లిం మత పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎంపీ మోపిదేవి ఇఫ్తార్ విందు

చెరుకుపల్లి: ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ దాన ధర్మాలకు ప్రతీక అని రాజ్యసభ సభ్యుడు వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణరావు పేర్కొన్నారు. మండలంలో రంజాన్ సందర్భంగా ముస్లింలకు కనగాల హెచ్‌ఎంకెఎస్ కళాశాల ఆవరణలో బుధవారం సాయంత్రం ఎంపీ మోపిదేవి ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆత్మీయ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యంలో పాల్గొన్నారు. ముందుగా మసీదు పెద్దలు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థనలో మోపిదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి రంజాన్ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నిష్ఠగా ఉపవాసాలు ఉంటూ మూడు పూటలా అల్లాను ప్రార్థిస్తారన్నారు. ఈ పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలందరూ సంతోషంగా జరుపుకోవాలని మోపిదేవి ఆకాంక్షించాడు, కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, ముస్లిం పెద్దలు అబ్దుల్ సమద్, కో–ఆప్షన్ సభ్యుడు ఫారుక్, సర్పంచ్ రజియా, ఎంపీటీసీ సభ్యురాలు అస్మా, అఖిల, షేక్ కరిముల్ల, గోరాబాబు, అల్లాం, సుభాని, అన్సార్, షంషుద్దీన్, మండలంలోని వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, మండలంలోని ముస్లింలు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



కనగాలలో టీడీపీకి చెందిన వారిని పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై జగనన్న పాలన వైపు ప్రతి ఒక్కరూ చూస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణరావు అన్నారు. మండలంలోని కనగాల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో హెచ్‌ఎంకేఎస్ కళాశాల ఆవరణలో బుధవారం అదే గ్రామంలో తెలుగు దేశం పార్టీకి చెందిన 30 కుటుంబాలకు చెందిన సుమారు 50మందికి పైగా రాజ్యసభ సభ్యుడు ఎంపీ మోపిదేవి వెంకట రమణరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, హెచ్‌ఎంకేఎస్ కళాశాల అధినేత అబ్దుల్ సమద్, ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, మండల కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ ఫారూక్, నాయకులు దొంతిబోయిన వెంకటేశ్వరరెడ్డి, కామినేని కోటేశ్వరరావు, చెన్ను కోటేశ్వరరావు, అఖిల, కరిముల్లా, తూము కోటేశ్వరరావు, కూరేటి శ్రీనివాసరావు, నలిగిల నాగేశ్వరరావు తురిమెళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా తాడికొండ శ్రీనుబాబు



కుచ్చెళ్లపాడు(వేమూరు): వరహాపురం సొసైటీ చైర్పర్సన్‌గా తాడికొండ శ్రీనుబాబు నియమితులైనట్లు కో–ఆపరేటివ్ బాపట్ల జిల్లా అధికారి రామారావు ఆదేశాలు జారీ చేశారని సొసైటీ సెక్రటరీ సురేష్ తెలిపారు. సొసైటీ చైర్‌పర్సన్‌గా తాడికొండ శ్రీనుబాబు, డైరెక్టర్లుగా చందు అజయ్‌బాబు, యల్లమాటి పరిశుద్ధరావును నియామకం చేశారని ఆయన తెలిపారు. బుధవారం నియామక పత్రాలు అందజేయటం జరిగిందని ఆయన చెప్పారు. ఈమేరకు సొసైటీ చైర్‌పర్సన్‌గా తన నియామకానికి కృషి చేసిన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునకు శ్రీనుబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ వరహాపురం సొసైటీ ద్వారా రైతులకు అనేక సేవలు అందిస్తానని, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి...

–ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యూజే బాపట్ల జిల్లా తొలి మహాసభ స్థానిక ముప్పలనేని శేషగిరిరావు ప్రాంగణంలో జిల్లా అధ్యక్షుడు చెన్నుపాటి రాంబాబు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళతానని, జర్నలిస్టుల సంక్షేమ సంఘం కార్యాలయానికి ఐదుసెంట్లు స్థలం ఇవ్వటంతోపాటు నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బారావు, జనార్దన్, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కృష్ణచైతన్య, కరణం వెంకటేష్‌బాబు, టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



బీమా నగదు అందజేస్తున్న కర్లపాలెం సర్పంచ్ లలితకుమారి

కర్లపాలెం: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ బీమా ఆసరా కల్పిస్తుందని కర్లపాలెం సర్పంచి నక్కా లలితకుమారి తెలిపారు. కర్లపాలెం పంచాయతీ ఎంవీ రాజుపాలెంలో శవనం ఏడుకొండలమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందటంతో ఆమె కుటుంబ సభ్యులకు గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి బుధవారం వైఎస్సార్ బీమా నగదు రూ.10వేలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైఎస్సార్ బీమా మిగతా నగదు త్వరలో అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యంగా ఉంటుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పఠాన్, ఎంపీటీసీ ఆసిఫ్ అలీ, వెల్ఫేర్ అసిస్టెంట్ ఎం.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బైక్ మాయంపై కేసు

తెనాలిరూరల్: బైక్ అపహరణపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్ సుందరయ్య నగర్‌కు చెందిన మల్లెల అమృతయ్య ఈ నెల 2వ తేదీన తన బైక్‌ను మార్కెట్ ఏరియాలోని దుకాణం ఎదుట ఉంచి లోపలికి వెళ్లి రాగా వాహనం కనబడలేదు. ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పసుపు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి

తెనాలి: పసుపు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సత్వరమే మార్క్‌ఫెడ్‌తో కొనుగోలు కేంద్రాలను ప్రారంభింపజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటికే 25 శాతం పంటను రైతులు అమ్ముకున్నారని తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కటువు వేసిందనే పేరుతో వ్యాపారులు క్వింటాలు కేవలం రూ.4000–4500లకు కొనుగోలు చేశారన్నారు. కేంద్రప్రభుత్వం పసుపునకు మద్దతు ధర ప్రకటించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ.6,850 ప్రకటించినా, మార్కెట్లో కనీస మద్దతు ధరకు కొనే నాథుడే లేక పసుపు రైతులు నష్టపోతున్నారని విచారం వ్యక్తంచేశారు. పసుపు, జొన్న, మొక్కజొన్న పంటలను దళారులకు అమ్ముకుని నష్టపోవద్దంటున్న ప్రభుత్వం, రైతుల్నుంచి కొనుగోలుకు తానే రంగంలోకి దిగాలని శివసాంబిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వీరితో జిల్లా కమిటీ సభ్యుడు ముద్దన సాంబశివరావు, సీఐటీయూ కార్యదర్శి షేక్ హుస్సేన్‌వలి, ఎం.పూర్ణిమ ఉన్నారు.

విద్యార్థులకు ఎంపీ మోపిదేవి అభినందనలు



ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీ మోపిదేవి వెంటరమణారావు

రేపల్లె రూరల్: అమరావతి నేషనల్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి నెలలో జాతీయస్థాయిలో నిర్వహించిన గణితం, సైన్స్, జీకే, హ్యాండ్ రైటింగ్ పరీక్షలలో రేపల్లె డివిజన్ విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. 2వ తరగతిలో గణితంలో షేక్ ఆర్షియా సుల్తానా (మాంట్‌ఫోర్ట్), అబ్దుల్ నవాజ్(మాంట్‌ఫోర్ట్) ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలవగా సైన్స్ ఒలింపియాడ్‌లో హీరా లూయిస్ ప్రథమ స్థానంలో నిలిచాడు. 6వ తరగతికి చెందిన పి.ప్రశీల్ మీరా(త్రిపుల్ ఎస్) సైన్స్‌లో ప్రథమ స్థానంలో నిలవగా, జీకేలో 8వతరగతి విద్యార్థి పి.ఉమేష్(ఆంధ్ర రత్న మున్సిపల్ హైస్కూల్) ద్వితీయస్థానంలో నిలిచాడు. 5వ తరగతిలో కె.జైదీప్ (ఆంధ్రరత్న స్కూల్) హ్యాండ్ రైటింగ్‌లో ప్రథమస్థానం సాధించగా, 7వతరగతిలో ఎల్.బెన్నీ(పేటేరు జడ్పీహైస్కూలు) విద్యార్థి డ్రాయింగ్‌లో ప్రథమస్థానంలో నిలిచాడు. అదేవిధంగా మాంట్‌ఫోర్ట్ స్కూల్ హెచ్‌ఎం బ్రదర్ కిరణ్‌కుమార్‌ను గురుదేవోభవ అవార్డు వరించింది. ఈ సందర్భంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులను, హెచ్‌ఎం కిరణ్‌కుమార్‌ను బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని తెలిపారు.

కార్యదక్షతకు మారుపేరు సర్దార్ గౌతు లచ్చన్న

విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు 'పరిశ'



సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పరిశ వెంకటేశ్వరరావు

పెదపులివర్రు(భట్టిప్రోలు): ప్రభుత్వాలు సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతి, జయంతిని అధికారికంగా ప్రకటించాలని విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరిశ వెంకటేశ్వరరావు కోరారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 17వ వర్ధంతి సందర్భంగా భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో బుధవారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తరువాత సర్దార్ అనే గౌరవం పొందిన ఏకైక వ్యక్తి లచ్చన్న అని పేర్కొన్నారు. సాహసానికి, కార్యదక్షతకు మెచ్చి ప్రజలు ఆయనకు ఇచ్చిన కితాబు సర్దార్ అని తెలిపారు. వాకా శ్రీరామచంద్రరరావు, జంపని వెంకటేశ్వరరావు, జంపని వీరయ్య, జంపని ఆంజనేయులు, జంపని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. భట్టిప్రోలులో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బౌద్ధస్థూపం ఆవరణలో లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాయన ప్రసాద్, తాతా సాయిబాబా, రాజులపాటి వెంకటేశ్వరరావు, యరగళ్ల సాంబయ్య, బొర్రా గాంధీ, కేసన కృష్ణయ్య, యార్లగడ్డ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

బాపట్లలో...

బాపట్ల: సర్దార్ గౌతు లచ్చన్న యువతకు ఆదర్శనీయులని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పీటా వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. సర్దార్ గౌతులచ్చన్న 17వ వర్ధంతి సందర్భంగా స్థానిక తూర్పు బాపట్లలోని పంచాయతీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం అనునిత్యం కృషిచేసిన సర్దార్ గౌతులచ్చన్న ఎంతో మందికి మార్గదర్శకులని పేర్కొన్నారు. కర్రి ప్రసాద్, మోర్ల సముద్రాలు, పీటా రవీంద్ర ప్రసాద్, పీటా భాస్కరరావు, సొంటి రామయ్య, మరీదు వెంకటేశ్వరరావు, కర్రి చంద్రమౌళి పాల్గొన్నారు.

బయో మైనింగ్ ప్రాసెసింగ్ మెషినరీ ప్రారంభం

రేపల్లె: పారిశుధ్యం మెరుగుపరచటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని మున్సిపల్ కమిషనర్ విజయసారథి అన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు పట్టణంలోని మాంట్‌ఫోర్ట్ స్కూలు సమీపంలో ఉన్న 1.69 ఎకరాల డంపింగ్‌యార్డులో ఏర్పాటు చేసిన బయో మైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్ మిషనరీని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ నిమిత్తం నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు అనుసరిస్తూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులు రూ.90లక్షలతో మిషనరీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మెషినరీలో గాజు పెంకులు, కాగితాలు, ప్లాస్టిక్ వంటి వ్యర్థాలు ఒకవైపు, మట్టి మరొకవైపు ప్రాసెస్ అవుతాయన్నారు. ఈ విధంగా చేయబడిన గాజు వస్తువులను గుంటూరులోని జిందాల్ ప్లాంట్‌కు, ప్లాస్టిక్‌ను తిరుపతిలోని సంఘమిత్ర ఏజెన్సీకి ఎగుమతి చేసి సంపదను సృష్టించుకోవటం జరుగుతుందన్నారు. ప్రస్తుతం మిషన్ ట్రైల్‌రన్ విజయవంతంగా జరిగిందని, రెండు నెలల్లో పూర్తిగా అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలియజేశారు. వైస్ చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, టీకేవీ గుప్త, ఏపీ సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖుద్దూస్, ఏతా శ్రీకాంత్ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం..

పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో ఈ నెల 20వతేది గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ అత్యవసర సమావేశం నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ విజయసారథి బుధవారం ఒకప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్మన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యుడు, అధికారులు హాజరుకావాలని కోరారు.

పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతం



పచ్చిరొట్ట పైర్ల విత్తనాలను ఆరబెడుతున్న రైతులు

కర్లపాలెం: పచ్చిరొట్ట పైర్లతో భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం మండల సహాయకుడు గంజి శ్రీకాంత్ తెలిపారు. బుధవారం యాజలి రైతు భరోసా కేంద్రం వద్ద పచ్చిరొట్ట పైర్లపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు రబీ పంటల సాగు అనంతరం వేసవిలో ఖాళీగా ఉండే వ్యవసాయ భూములలో పచ్చిరొట్ట పైర్లు సాగు చేయటం వలన భూసారం పెరుగుతుందని తెలిపారు. పచ్చిరొట్ట పైర్లగా పిల్లిపెసర, పెసర, జనుము, జీలుగ లాంటి పైర్లు సాగుచేసి భూమిలో కలియదున్నటం వలన భూమి సారవంతమవుతుందని చెప్పారు. సారవంతమైన భూములలో సాగు చేయటం వలన దిగుబడులు బాగా వస్తాయని శ్రీకాంత్ చెప్పారు. రైతులకు పచ్చిరొట్ట విత్తనాల కిట్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ గోపి, ఐసీ ఆర్పీఎస్ సత్యనారాయణ, భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

గ్రాసం కోసం వలస బాట



వేసవిలో గ్రాసం కోసం పశువులు వలస వచ్చాయి. పల్నాడు జిల్లా మాచర్ల నియోజక వర్గంలోని ఆవులు వేమూరు, కొల్లూరు ప్రాంతాలకు మేత కోసం వచ్చాయి. వేసవి అంతా డెల్టా ప్రాంతంలో ఉండి ఖరీఫ్ సీజన్ ప్రారంభం నాటికి తిరిగి వెళతామని పశువుల కాపరులు తెలిపారు.

– వేమూరు